నవ్య వారపత్రిక – విశ్వపతి కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ

# బతుకు





**మా** పెద్దమ్మ మీకు తెలుసు కదా?

అదేనండీ మా బెజవాడ పెద్దమ్మ. ఆవిడ పేరేవిటంటే... ఛ్ఛ..గుర్తురావట్లేదు... చిన్నా పెద్దా అందరం పెద్దమ్మ అనే అంటాం. నర్సాపురం సుబ్బారాయుడి గారి పెద్దమ్మాయి – సత్యనారాయణ గారి భార్య. ఆయన్ది రైల్వేలో ఉద్యోగం. గుర్తొచ్చిందా?

మరీ పొడగరి గాక పోయినా కొంచెం ఎత్తుగా దబ్బపండు రంగులో ఉంటుంది. నుదుటి మధ్య అక్షరాలా రూపాయి బిళ్ళంత బొట్టు, కళ్ళు నిండిపోవడంతో ఎప్పుడూ ఒలికిపోతూ పోతూ ఉండే ఆప్యాయత, పెదాలు మీద వెన్నెలంత చల్లని చక్కని నవ్వు... ఆవిడ నవ్వు చూసే బెజవాడ కనకదుర్గమ్మ అంత ఆత్మీయంగా నవ్వటం నేర్చుకునుంటుందని చిన్నప్పుడు మేం చెప్పుకునే వాళ్ళం. ఆవిడ్ని ఎప్పుడో ఒకప్పుడు బెజవాడలో చూసే ఉంటారు. ఆవిడెవరో తెల్సిందా?

మా పెద్దమ్మండీ. మా అమ్మకి అక్క అన్నమాట. ప్రతి వేసవి సెలవుల్లో నేనూ మా చెల్లీ, పిన్నిగారబ్బాయి వేణూ, బుల్లి పిన్నిగారబ్బాయి విశ్వం, అమ్మాయి విజయ అందరం బందరు పాసెంజర్ ఎక్కి బెజవాళ్ళో వాలిపోయే వాళ్ళం.

మేం ఎంత అల్లరి చేసినా విసుక్కునేది కాదు కసురు కునేది కాదు. అసలు పెద్దమ్మకి కోపమంటేనే తెలీదు. మేం ఏం చేసినా మురిసిపోయేది. సున్నుండలు ఎంత కమ్మగా, చంద్రకాంతాలూ ఎంత తీయగా చేసేదో చెప్పలేను. ఏది వండినా సరే కొసరి కొసరి తినిపించేది. పాటలు పాడేది. కథలు చెప్పేది.

కీలుగుర్రం కథ ఎంత బాగా చెప్పిందంటే ప్రతి ముక్కా నాకిప్పటికీ గుర్తే.

కనకదుర్గమ్మ తల్లిని చూస్తే పిల్లలు జడుసుకుంటారని నా చిన్నప్పుడు భయపెట్టే వారు. ఓసారి మమ్మల్నందర్నీ గుడికి పెద్దమ్మ తీసుకెళ్ళింది. మాకు అండగా పెద్దమ్మ ఉందనో ఏమో ఆ తల్లి మాకు నవ్వుతూ కన్పించింది. 'చల్లగా బతకండ్రా' అని దీవించింది. నిజం!

కృష్ణ ఒడ్డునే స్నానం చేసి వచ్చేవాళ్ళం. లోపలికంటా వెళ్ళిపోతామేమోనని మా రెక్క వదిలేది కాదు మా పెద్దమ్మ.

సినిమాలు చూశాం. నాటకాలు చూశాం. గాంధీ పర్వతం ఎక్కాం. ఎగ్జిబిషన్లో రంగుల రాట్నం మీద తిరిగాం.

ఓహ్! ఆ రోజుల్ని తలచుకుంటే చాలు మళ్ళీ చిన్న పిల్లాడినై పోతాను.

హైస్కూల్లో చేరాక బెజవాడ వెళ్ళడం రావడం కాస్త తగ్గింది. కాని పెద్దమ్మ కబుర్లు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉండేవి.

పిల్లలంటే ఎంతో ఇష్టమైన పెద్దమ్మకి ఎంచేతో పిల్లలు పుట్టలేదు. ఎందరో డాక్టర్లకి చూపించుకున్నారు. మా ఊరి ఆచార్యులుగారి చూర్ణాలూ లేహ్యాలూ కూడా తింది. అయినా

పాపం పెద్దమ్మ కడుపు పండలేదు.

ఒకరోజున సత్యనారాయణ పెదనాన్న ఇంకో పెళ్లి చేసుకుంటున్నాడని తెలిసింది. వెంటనే అమ్మా నాన్నా బెజవాడ వెళ్తోంటే నేనూ తోకలా వెంట బడ్డాను.

"రెండో పెళ్ళికి ఒప్పుకో వద్దు" అని అమ్మా నాన్నా గట్టిగా చెప్పేరు. కాని పెద్దమ్మ ఎప్పట్లా నవ్వుతూనే తోసి పుచ్చింది.

"నట్టింట పిల్లలు తిరగని ఇల్లూ ఒక ఇల్లేనా! అయినా వంశం నిలబడొద్దూ! తల కొరివి పెట్టడానికైనా ఒక నలుసు ఉండొద్దూ!" అంది.

"రేపు నువ్వనుకున్నట్టు జరగదు. సవతి అంటే నిప్పుల కుంపటి. నిన్ను నవ్వ నివ్వదు, నిద్రపోనివ్వదు. నిశ్చింతగా ఉండనివ్వదు" కోప్పడింది అమ్మ.

"కొత్తావిడొచ్చేక మిమ్మల్ని పాత సామాన్ల గదిలో పడేస్తారు. పిల్లల కోసం కాపురాన్ని కాలదన్ను కోవద్దు. పిల్లలే కావాలంటే దత్తత చేసుకోండి. అంతగా కావలిస్తే ఇదిగో మా గోపీగాడ్ని దత్తత ఇచ్చేస్తాం పెంచుకోండి" అన్నాడు నాన్న నన్ను ముందుకి తోస్తూ.

నా గుండెలు గుభిల్లుమన్నాయి. నన్ను సందిట్లోకి తీసుకుంటూ, "ఏరా, ఈ పెద్దమ్మ కొడుకుగా ఉంటావా" అనడిగింది.

'వూహూఁ ' అన్నాను తల అడ్డంగా వూపుతూ.

ఫక్కున నవ్వింది పెద్దమ్మ.

"చిన్న పిల్లోడు వాడికేం తెలుసక్కా. వాడికి నువ్వంటే చాలా ఇష్టం. నేను ఒప్పిస్తాగా" అంది అమ్మ.

"ఆయన రెండో పెళ్లి చేసుకోడానికి నేను ఒప్పుకున్నాను. మా అత్తగారు సంబంధాలు చూడటం మొదలు పెట్టింది" మెల్లగా అసలు సంగతి బయటపెట్టింది.

"అదీ అలా చెప్పు. ఇదంతా మీ అత్తగారి నిర్వాకమన్నమాట. ఆవిడ సాధింపులు పడలేక నువ్వు తగుదునమ్మా అంటూ తలాడించావన్న మాట. నీ అంతగా నువ్వు నిప్పులగుండంలోకి దూకుతానంటావేంటక్కా. ఇలాంటి చోద్యం నేనెక్కడా చూళ్ళేదు, విన్లేదు!" అంది అమ్మ బుగ్గలు నొక్కుకుంటూ.

"ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీరు కాదంటే అన్నయ్య గారికి నచ్చ చెబుతాను. మీ అంగీకారం లేకుండా రెండోపెళ్లి చేసుకుంటే ఆయన ఉద్యోగానికే ముప్పు వస్తుంది" అన్నాడు నాన్న.

"మీరలాంటి ఆటంకాలేమీ కల్పించొద్దు. నా గురించి భయపడొద్దు. పైన నారు పోసిన దేవుడున్నాడు. కింద మొలకెత్తించే భూదేవి ఉంది. మధ్యలో తాళి కట్టిన మొగుడున్నాడు. నాకేం కాదు..."

పెద్దమ్మ ధీమా మాటలకు హతాశులయ్యారు అమ్మా నాన్నా. వెంటనే వెనుదిరిగాం. దారి పొడవునా పెద్దమ్మకి శాపనార్థాలు పెడుతూనే ఉన్నారు.

పెద్దమ్మంటే ఎంతో జాలేసింది. 'పెద్దమ్మకేమీ కాకూడదు' అని దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను.

తర్వాత వచ్చిన వేసవి సెలవుల్లో నేనూ చెల్లీ, పెద్దమ్మ ఇంటి కెళ్ళాం. ఎంచేతో ఆ ఏడాది వేణు, విశ్వం, విజయ రాలేదు.

పెద్దమ్మలో ఎలాంటి మార్పూ రాలేదు. ఇది వరకట్లానే ఉంది. ఆమె ఆప్యాయతా అభిమానాల్లో కొంచెం కూడా తేడా రాలేదు.

కాని చిన్నమ్మ మమ్మల్ని చూసి ముఖం చిట్లించింది. మేమన్నా మా మాటలన్నా ఇష్టం ఉండేవి కాదు. ఇంటి చుట్టూ ఆడుకోనిచ్చేదికాదు. పూలు కోయనిచ్చేది కాదు. ప్రతిదానికీ పెద్దమ్మకీ పెదనాన్నకీ ఫిర్యాదు చేసేది. మాకేమైనా తినడానికి పెడుతోంటే ఇంతింత కళ్ళతో చూసేది. ఆపైన మూతి ముడిచేది.

ఆమె మాకు బొత్తిగా నచ్చలేదు. ఆమె సోకులూ పద్దతులూ సెంట్లూ పౌడర్లూ పూలూ సిల్కు చీరలూ ఏవీ నచ్చలేదు.

"చూశావా చూశావా అన్నయ్యా. చిన్నమ్మ టక్కులాడి. పెదనాన్నని ఆడిస్తోంది" ముదినాపసానిలా అంది నా చెల్లెలు.

ఆవిడ ఉండగా వాళ్ళింటి కెళ్ళకూడదనుకునే వాళ్ళం. కానీ పెద్దమ్మని చూట్టానికి వెళ్తూనే ఉండే వాళ్ళం. ఎన్నో తెచ్చుకుంటూనే ఉండే వాళ్ళం. మా అందరిలోకీ నేనే పెద్దవాణ్ణని నన్ను మరింత గారాబంగా చూసేది. ఏం కావాలో అడిగి మరీ కొనిచ్చేది. అందుకనే వేణూ విశ్వం ఎప్పుడూ కుళ్ళుకునే వారు.

"పెద్దమ్మ ఎలా ఉందిరా గోపీ. పెదనాన్నా చిన్నమ్మా పెద్దమ్మని బాగా చూసుకుంటున్నారా? సంతోషంగా ఉందా?" అంటూ గుచ్చి గుచ్చి అడిగేది అమ్మ.

'ఓ' అంటూ ఎన్నో చెప్పుకొచ్చేవాళ్ళం.

"ఒక ఒరలో రెండు కత్తులూ ఒకింట్లో రెండు కొప్పులూ ఎలా ఇముడుతాయీ! తనలో తను ఎంత మదన పడుతోందో పిచ్చి అక్క!" అని బాధపడిపోయేది అమ్మ.

తర్వాత చిన్నమ్మకి ఇద్దరబ్బాయిలూ ఒకమ్మాయీ పుట్టారు.

మేం ఎప్పుడెళ్ళినా పెద్దమ్మే వాళ్ళకన్నీ అమర్చేది. ఒకటికెళ్ళినా రెంటికెళ్ళినా అన్నీ శుద్ధి చేసేది. చందమామని చూపించి గోరుముద్దలు తినిపించేది. పెద్ద పిల్లల్ని దగ్గర కూర్చో బెట్టుకుని చదివించేది. వాళ్ళు కూడా ఏం కావాల్సొచ్చినా పెద్దమ్మనే అడిగేవారు. వాళ్ళూ మా పెద్దమ్మని 'పెద్దమ్మ' అనే పిల్చేవారు.

వాళ్ళలా పిలిస్తే నాకు చాలా కోపం వచ్చేది. చాటుగా చిన్న చిన్న రాళ్ళతో కొట్టేవాణ్ణి.

గిల్లేవాణ్ణి. వాళ్ళు ఏడుస్తూ వెళ్ళి చెబితే పెద్దమ్మ నన్ను వెనకేసుకొచ్చేది కాని చిన్నమ్మ తిట్టిపోసేది. నాకు భలే సంతోషంగా ఉండేదిలే.

చిన్నమ్మ అసలు తన పిల్లల ఆలనా పాలనా చూసేదే కాదు. రాణీగార్లా ఎప్పుడూ గదికి అంటుకుపోయేది.

అందం తరిగి పోతుందని పిల్లలకి పాలు కూడా సరిగ్గా ఇచ్చేది కాదనీ, పెద్దమ్మ ఆవు పాలు పట్టించేదనీ, అమ్మా పిన్నీ చెప్పుకొంటోంటే విన్నాను.

"పెద్దక్క సవతిని నెత్తిమీద కెక్కించుకుంటోందనుకో. ఆవిడ గురించి ఒక్క చెడుమాట మాట్లాడదు. తరచి అడిగినా ఏమీ చెప్పలేదక్క. 'నాకేమే' అని నవ్వేస్తుంది. తనది గాలిలోని దీపం బతుకని తెలుసుకోలేకపోతోంది" అని పిన్ని ఓసారి అమ్మ దగ్గర వాపోయింది.

"సవతి పిల్లల్ని తన పిల్లలు అనుకునే వాళ్ళు లోకంలో ఎవరూ ఉండరు ఒక్క అక్క తప్ప. దాని రాతలా కాలింది. ఏం బతుకో ఏమో. బాధపడటం తప్ప మనం ఏం చెయ్యగలం చెప్పు" అని బాధపడింది అమ్మ.

పెద్దమ్మ గుర్తొస్తే చాలు నాకూ బాధేసేది. 'పాపం' అన్పించేది, తనకోసం ఏమైనా చేస్తే బావుణ్ణన్పించేది. ఏం చేయాలో తెలీని వయసు నాది!

కాలేజీలో చదువుతూండగా, "గోపీని చూడాలని ఉంది" అని ఎవర్తోనో కబురంపింది పెద్దమ్మ. ఆ మర్నాడే నేనొక్కణ్ణే వెళ్ళాను.

పెద్దమ్మ ఏ మాత్రం మారలేదు. ఇది వరకట్లానే ఇంటిపనీ వంటపనీ చూస్తోంది. ఇప్పుడు పిల్లల చదువు సంధ్యలూ అదనమయ్యాయి. అన్నీ తనే చూసుకొంటోంది.

అక్కడున్న రెండ్రోజులూ నన్ను వదల్లేదు. నేనెంతో పెద్దవాడ్నయ్యాననీ, బుద్ధిమంతుడ్ననీ, బాగా చదువుకుంటున్నాననీ పెదనాన్నతో చిన్నమ్మతో ఇరుగు పొరుగుల్తో చెప్పి ఎంత పొంగిపోయిందో చెప్పలేను.

"నేను పెద్దయ్యాక నిన్ను బాగా చూసుకుంటాను పెద్దమ్మా. అప్పుడు నా దగ్గరికి వచ్చేద్దువు గాని" అన్నాను వేడి వేడి మెత్తని పకోడీలు తింటూ.

"మా నాయనే, మా తండ్రే. ఎంత ఎదిగిపోయావురా!" అంటూ మురిసిపోయింది. ఆ మాటని టాంటాం వేసింది కూడా.

నాకు రెండు జతల కొత్త బట్టలు కుట్టించింది. అవి కొత్తరకం ఫ్యాషన్వి. ఎంత ఆనందపడిపోయానో మాటల్లో వర్ణించలేను.

నాకే కాదు వేణుకీ విశ్వానికీ విజయకీ కూడా ఎన్నెన్నో కొని పెట్టేది. "బాగా చదువుకోండి. చదువుని మించిన ఐశ్వర్యం లేదు" అని పదే పదే చెప్పేది.

చదువవుతూనే నాకు ఉద్యోగం వచ్చింది. ఆ వెంటనే పెళ్లయ్యింది. పెద్దమ్మా పెదనాన్నా చిన్నమ్మా వాళ్ళ పిల్లలూ అంతా పెళ్ళి కొచ్చారు. పెళ్ళిలో మా దంపతులిద్దరికీ

పెద్దమ్మ ఉంగరాలు చదివించింది. పెద్దమ్మకి మేం ప్రత్యేకంగా పట్టుచీర పెట్టాం.

"మా గోపీగాడి పెళ్లిలో ఈ పెద్దమ్మకి పట్టుచీర" అంటూ ఎంతో సంబరపడింది.

"వచ్చే నెలలో కాపురం పెడతాను. మా ఇంటికి మొదటి అతిథిగా నువ్వే రావాలి పెద్దమ్మా" అన్నాను.

అప్పుడెంత ఆనందపడిందంటే కళ్ళ నుండి ఆనంద భాష్పాలు పది నిమిషాలదాకా జలజలా రాలుతూనే ఉన్నాయి.

"నీ ఇంటికి రాకుండా ఎలా వుండగలన్రా. మీ పెదనాన్నా నేనూ తప్పకుండా వస్తాంరా" అని ప్రామిస్ చేసింది.

కానీ ఆ ప్రామిస్‌ని ఎప్పుడూ నిలబెట్టుకోలేదు. ఎప్పుడడిగినా "పెద్దోడికి పరీక్షలు" "చిన్నోడికి ఒంట్లో బావోలేదు" "మీ పెదనాన్న క్యాంపులో ఉన్నారు" అంటూ ఏవేవో వంకలు పెట్టేది.

"పెద్దమ్మ ఆ ఇల్లు వదలి రాలేదురా. ఆ ఇంటికి వంటలక్క అయిపోయింది. ఆ ఇంటికీ సవతి పిల్లలకీ చాకిరీ చెయడానికే పుట్టింది!" అంటూ కంటతడి పెట్టుకునేది అమ్మ.

చిన్నమ్మ కొడుకు పెద్దోడి పెళ్లి కెళ్ళాం నేనూ మా ఆవిడా. అదైనా తప్పకుండా రావాలని పెద్దమ్మ ప్రత్యేకంగా ఫోన్ చెయ్యడంతో ఆమె మాట త్రోసి పుచ్చలేక పోయాం.

పెళ్లి పనులు దగ్గరుండి చక్కబెట్టిందంతా పెద్దమ్మే. కాని అమ్మాయి తరపువాళ్ళు గౌరవ మర్యాదలన్నీ చిన్నమ్మకిచ్చారు. వారి ధోరణి చూసి మేం తట్టుకోలేకపోయాం. కాని పెద్దమ్మ పైకి మామూలుగానే ఉంది. లోపలెన్ని బడబాగ్నులు బ్రద్ధలవుతున్నాయో తెలీదు.

అంచేతే చిన్నోడి పెళ్ళికీ చిన్న చెల్లి పెళ్లికీ మేం వెళ్ళలేదు. లీవు దొరకలేదని అబద్ధమాడాను.

మేం పెళ్లికి రాలేదని పెద్దమ్మ ఎంతో బాధపడిందని అమ్మ చెప్పినప్పుడు 'వెళ్ళుండాల్సిందేమో' అని మథన పడకుండా ఉండలేకపోయాను.

ఆ మధ్య పెద్దమ్మ భుజం నొప్పితో బాధపడుతోందని తెలిసింది. కేరళ ఆయుర్వేద తైలం పంపించాను. అది మర్దనా చేశాక 'మాంచి గుణం కన్పించిందిరా గోపీ" అంటూ ఫోన్ చేసి చెప్పింది.

"పిల్లల్ని తీసుకుని ఒకసారి రండ్రా. ఈ పెద్దమ్మ కథలూ కబుర్లూ వినకుండా మీ పిల్లలు పెద్దవాళ్ళెలా అవుతార్రా!" అంటూ నవ్వింది.

"త్వరలో వస్తాం పెద్దమ్మా. కనకదుర్గ గుడికెళ్ళి చాలా ఏళ్ళయింది కూడానూ" అన్నాను గాని రాలేకపోయాం.

హఠాత్తుగా పెదనాన్న చనిపోయారని ఫోన్ వచ్చింది. హార్ట్ ఎటాక్ అట.

పెద్దమ్మ ఎలా వుందో ఆ ఘోర వార్తకెలా తట్టుకుంటుందో అనుకునే సరికి గుండె పట్టేసింది.

అదీగాక ఇప్పుడు పెద్దమ్మ పరిస్థితేమిటన్నది పెద్ద ప్రశ్నార్థకమై నాకళ్ళ ముందు నిలబడింది!

చిన్నమ్మ చలాకీ మనిషి. తెలివైంది. ఆస్తులన్నీ తన పేరు మీద పెట్టేయించుకుందని ఓసారి అమ్మ చెప్పింది. కూతురుకీ బాగానే కట్నం ఇచ్చి పెళ్లి చేశాడు. కొడుకులూ ఉద్యోగాల్లో సెటిలయ్యారు.

ఇప్పుడు వాళ్ళంతా ఒక్కటవుతారు.

ఇంట్లో పెద్దమ్మకి జానెడు చోటు ఉంచుతారో లేక నిర్దాక్షిణ్యంగా మెడబట్టి బయటికి గెంటేస్తారో?!

ఆమె దైన్య రూపం కళ్ళముందు కదలాడుతోంటే తట్టుకోలేకపోయాను. బుల్లి పిన్ని కూతురు విజయకి ఫోన్ చేశాను. ఆమె పెళ్ళయ్యాక విజయవాడలోనే ఉంటోంది. పచ్చళ్ళూ వడియాలే కాదు నానా వంకలూ పెట్టి పెద్దమ్మ నుంచి బాగానే గుంజు కొంటోందని అమ్మ ఎప్పుడూ దెప్పుతూ ఉంటుంది.

"పెద్దమ్మని ఈ కళ్ళతో చూడ లేకుండా ఉన్నాను గోపీ అన్నయ్యా. మహాలక్ష్మిలా కళకళ లాడుతూ ఉండే పెద్దమ్మ ఇప్పుడు శోకమూర్తిలా ఉందనుకో..." అంటూ మధ్యలో మూడుసార్లు ముక్కు చీదింది.

"వార్త విన్నప్పట్నుంచీ నాకే కాళ్ళూ చేయీ ఆడటం లేదు. ఇక పెద్దమ్మకెలా ఉందో!"

"నీకో సంగతి చెప్పనా అన్నయ్యా. ఎవరితోనూ అనకు సుమా. చిన్నమ్మ పెదనాన్న శవం మీద పడి భోరు భోరున ఏడ్చింది. గుండెలు బాదుకుంది. పెద్దమ్మేమో రాయిలా కూర్చుండిపోయింది. ఒక ఏడ్పూ లేదు పెడబొబ్బలూ లేవు. అంతా చెవులు కొరుక్కున్నారు తెలుసా?"

"అరె. అలాగా.. అలా ఎలా ఉండగలిగింది? ఒకవేళ పెదనాన్న పెద్దమ్మని ఒక పని మనిషిలా చూసేవాడేమో. అందుకే ఆమె కళ్ళల్లోకి నీళ్ళు ఉరకలేదేమో? పీడపోయిందని లోలోన సంతోషిస్తోందేమో?"

"దగ్గరగా ఉండి చూశానుగా. పెదనాన్న కఠినాత్ముడు కాదు అన్నయ్యా. పెద్దమ్మే బుడ బుడ మంటూ ఉన్నదంతా వూడ్చి మరీ పెట్టుపోతలకి పోతుంది. తన నగలన్నీ కోడళ్ళకీ మనవరాలికీ దోచి పెట్టింది. ఒంటిమీద తులం బొందూ అరకాసు నల్లపూసల

తావళమే ఉన్నాయి. ఆఖరికి చేతి గాజులక్కూడా మంగళహారతి పాడేసిందనుకో"

"ముందు చూపు లేక పోతే ఎలా? ఈ రోజుల్లో ఎవరి బాగు వాళ్ళే చూసుకోవాలని తెలుసుకోలేకపోయిందంటే పెద్దమ్మ ఎంత అమాయకురాలో అర్ధమవుతోంది. ఇక మనం చూస్తూ వూరుకో కూడదు విజయా. పెద్దవాళ్ళ మీదకి భారం బాధ్యతా వదిలెయ్యకూడదు. వాళ్ళదంతా నాన్చుడు వ్యవహారం. మనం రంగంలోకి దిగిపోయి పెద్దోడ్నీ చిన్నోడ్నీ నిలదీయాలి. పెద్దమ్మకి సరైనా వాటా ఇప్పించాలి. న్యాయం చెయ్యాలి" ఆవేశపడ్డాను.

"పెద్దకర్మకి అన్నయ్యలంతా వస్తారుగా. అప్పుడు మాట్లాడదామైతే..."

కర్మకాండలవ్వకుండా ఆస్తుల పంపకాల గురించి మాట్లాట్టం మర్యాద కాదు కూడానూ. వేణునీ విశ్వాన్నీ అవాళ్టికి తప్పకుండా రమ్మని కోరాను.

అనుకున్నట్టుగానే అందరం ఆ కార్యక్రమానికి హాజరయ్యాం.

తెల్లచీర ధరించిన విషాద శిలావిగ్రహంలా ఉన్న పెద్దమ్మని చూసి దుఃఖం నిభాయించుకో లేకపోయాం.

"ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు. పెద్దమ్మ గురించేమైనా ఆలోచించారా" అమ్మా నాన్నా బాబాయిలూ పిన్నులూ ఉండగా అడిగాను.

"అడిగాం. అందరూ కావాలనుకోవడమే తనకి తెలుసు అంది" అన్నారు నాన్న.

"వాళ్ళంతా నిన్ను కావాలనుకుంటారా అనడిగితే దేవుడి ఫోటోల వంక చూస్తుంది. మొదట్నుంచీ పెద్దక్క వరస ఇంతే. పెట్టడం తప్ప తన కోసం దాచుకోవడం బొత్తిగా తెలీదా మనిషికి" పిన్ని చెప్పింది.

"అలా అని అయినవాళ్ళం ఉండి కూడా వెనకా ముందూ ఎవరూ లేనట్టు వదిలెయ్యలేం కదా. పెద్దమ్మ భవిష్యత్తుకి ఢోకాలేని విధంగా ఏదైనా ఏర్పాటు చెయ్యాలి..."

"ఆస్తిపాస్తుల గురించి మేం మట్లాడితే బాగోదురా, మీరంతా పూనుకోండి..." అన్నారు నాన్న.

కజిన్స్ అందరం అంగీకార సూచకంగా తలలాడించాం.

దినకర్మరోజు రాత్రెవరూ ఆ ఇంటి నిద్ర చేయకూడదు గనుక హొటల్లో రూము తీసుకుని ఉందామని బయల్దేరాం.

"పెద్దమ్మకి సంతానం లేదు. మనం పెద్దమ్మ చెల్లెళ్ళ పిల్లలం గనుక మనకేమైనా ఆస్తి కలిసి వస్తుందంటావా అన్నయ్యా" దారిలో విశ్వం అడిగాడు - సందేహిస్తూనే.

పెదవి విరిచాను . "కష్టం రా. అంతా పెదనాన్న సంపాదనే కదా. కాదంటే తన పేరన ఏమైనా ఆస్తులుంటే పెద్దమ్మ తనకిష్టమైన వాళ్ళకి రాసిచ్చే హక్కు ఉంటుంది"

"తాతయ్య పసుపు కుంకాల కింద ఇచ్చిన ఎకరం పొలం పెద్దమ్మ పేరు మీదే

ఉందన్నయ్యా" గబుక్కున అంది విజయ.

"చూద్దాంలే. ముందు తనకి రావాల్సిన వాటా దక్కనీ"

మర్నాడు మేం ముగ్గురం, విజయ, వాళ్ళాయన అంతా కలిసి పెద్దమ్మ ఇంటికెళ్ళాం.

సామాన్లు లారీకెక్కిస్తున్నారు పెద్దోడు, చిన్నోడు.

గబగబా లోపలికెళ్ళాం. చిన్నమ్మ తెల్లచీరలోనే ఉంది గాని పెద్దమ్మ ఇది వరకట్లానే రంగు చీర కట్టుకుని పెద్దబొట్టు పెట్టుకుని కన్పించింది.

మనస్సు చేదుగా అయింది.

"పెద్దమ్మకి మతి స్థిరం తప్పలేదు కదా?" మెల్లగా విజయనడిగాను.

"గుండ్రాయిలా ఉంది"

"ఓ పదిరోజులన్నా ఆగకుండా ఈ వేషమేంటి?"

"పదిరోజులాగితే ఏమవ్వుద్ది?"

"అదికాదే, నలుగురూ నాలుగు రకాలుగా అనుకోరూ?"

"పది రోజులు పోయాక ఇలా ఉన్నా అనుకుంటారు"

ఆమె ధోరణికి మండుకొచ్చింది. బొత్తిగా కామన్‌సెన్స్ లేకుండా మాట్లాడుతోంది!

"అయినా పెద్దమ్మ స్వభావం వేరు. తనేమనుకుంటే అది చేసేస్తుంది తప్ప ఎవర్నీ పట్టించుకోదు"

తిరిగి తనే అంది. నేను బదులివ్వలేదు. మాట్లాడాలన్చెప్పి పెద్దోడ్నీ చిన్నోడ్నీ కూర్చో బెట్టాం.

విసుగ్గా చూస్తూ అయిష్టంగా కూర్చున్నారు. నుదురు చిట్లించి చూడసాగారు వారి భార్యలు.

"మీతో చిన్నమ్మని తీసుకెళ్ళిపోతున్నారు. సంతోషమే. మరి పెద్దమ్మ సంగతి ఏమి ఆలోచించారు?"

"ఆలోచించడానికేముంది ఎవరి దారి వాళ్ళదే, ఎవరి బతుకువాళ్ళదే" చిన్నోడన్నాడు.

"పెద్దమ్మ మీకూ పెద్దమ్మే కదా. తను మీ మీదే ఆధారపడి ఉంది. ఆమెకు దారి చూపాల్సిన బాధ్యతా మీదే. పోనీ ఆమెనీ మీతో బాటు తీసుకెళ్ళకూడదూ?"

"సరిపోయింది. ఇప్పటికే మా అమ్మనెవరు భరిస్తారంటూ మేం గుంపుచింపులు పడ్డాం. కడకి చెరో ఆర్నెల్లూ ఉంచుకునేట్టు రాత్రే ఒక అంగీకారానికొచ్చాం. మీకు తెలుసుగా, ముసలోళ్ళంటే రోగాలూ రొచ్చులూ డాక్టర్లూ మందులూ సేవలూ. అంత ఓపికా తీరికా లేకే కదా వృద్ధాశ్రమాల్లో చేర్చేస్తున్నారంతా. అవి సిటీలో బొచ్చుడున్న సంగతి మీకూ తెలుసుగా!"

"మరీ దారుణంగా మాట్లాడకండి. మీ అమ్మకన్నా ఎక్కువగా మీ ఆలనా పాలనా

చూసి మిమ్మల్ని ఇంత వాళ్ళని చేసింది పెద్దమ్మ. అలాంటి ఆమె అంటే మీకు కనీస కృతజ్ఞత కూడా లేకపోవడం దారుణం"

"ఆయాల్ని అమ్మగా చూసేంత గొప్ప మనస్సు మాకు లేదు..."

వాళ్ళు లేచి వెళ్ళబోతోంటే, "మరి ఆస్తిపాస్తుల్లోనైనా పెద్దమ్మకి వాటా పంచి ఇచ్చారా తొంటి చెయ్యి చూపించారా?" విజయ అడిగింది.

"ఎవరికేం చెందాలో అవన్నీ మా నాన్న ముందే రాసిచ్చారు..."

ఇది కొత్త వార్త. మాకు నోటంట మాట రాలేదు.

వాళ్ళూ వాళ్ళ కుటుంబాలూ చిన్నమ్మనీ కొంత సామాన్నీ తీసుకుని వెళ్ళిపోయారు.

వారికి కన్నీటితో వీడ్కోలు ఇచ్చింది పెద్దమ్మ. "ఈ పెద్దమ్మని మర్చిపోకండ్రా. వస్తూ వెళ్తూండండి..." అంది.

తర్వాత మేమంతా పెద్దమ్మని మాటామంతిలోకి దింపాం.

"నీ గురించేం ఆలోచించావ్ పెద్దమ్మా. ఎక్కడుంటావ్? ఎలా ఉంటావ్?" బోలెడు సానుభూతి ఒలక బోస్తూ అడిగాను.

చిన్నగా నవ్వింది. "మీ ఇంటికి రానా గోపీ?"

ఊహించని ప్రశ్నకి అదిరిపడ్డాను. కన్నవాళ్ళనే పిల్లలు పట్టించుకోవట్లేదు. పెంచిన వాళ్ళూ దులపరించేశారు. అలాంటిది నేనెలా ఈమె బరువు తలకెత్తుకోగలను? సెంటిమెంటు వేరు వాస్తవం వేరు. ఒకరోజూ రెండ్రోజులూ కాదు బ్రతికినన్నాళ్ళూ భరించాలంటే ఎవరికి సాధ్యం? సంగతి తెలిస్తే అసలు గుమ్మంలో అడుగే పెట్టనివ్వదు నా భార్య. కనీసం దండిగా ఆస్తిపాస్తులుండి ఉంటే ఏమి చేసేవాణ్ణో. కాని ఇప్పుడేమీ చెయ్యలేను. అయామ్ హెల్ప్ లెస్!

మిగతా వాళ్ళ వంక చూశాను. అంతా ఇబ్బందిగా మొహాలు పెట్టుక్కూర్చున్నారు.

ఇంతలో సెల్ మ్రోగింది. పెద్దమ్మ ఏదో మాట్లాడింది.

"నేనలా పోలీస్‌స్టేషన్ దాకా వెళ్ళొస్తాను. మీరాలోచిస్తూ ఉండండి..."

మేం మ్రాన్పడి పోయి చూస్తోంటే మా కళ్ళముందు నుంచే హడావిడిగా వెళ్ళిపోయింది.

ఇప్పుడు పోలీస్ స్టేషన్‌కెందుకు? ఎవరి మీద ఏం కేసు పెట్టడానికి? మాకెవరికీ ఏమీ అర్థం కాలేదు.

"పెద్దమ్మ అదో తరహా మనిషి. అయిన వాళ్ళకి ఆకుల్లోనూ, కాని వాళ్ళకి కంచాల్లోనూ పెడుతుంది" అక్కసుగా అంది విజయ.

"గోపీకి తప్ప ఇంకెవరికీ ఏమీ పెట్టలేదు" వేణు అన్నాడు.

"వందా పదీ తప్ప నాకు మాత్రం ఏం పెట్టింది!" గబుక్కున అనేశాను. పెద్దమ్మ

నాకేదో తవ్వి తలకెత్తిందని వీళ్ళంతా అపోహపడుతున్నారు.

అందరం కడుపులో ఉన్నది కక్కేసుకుని, మళ్ళీ మేమే ఎత్తేసుకొంటోంటే పెద్దమ్మ ముగ్గురు చిన్న పిల్లల్ని తీసుకుని ఆటో దిగింది.

"వీళ్ళెవరు పెద్దమ్మా"

"మీ చెల్లెళ్ళూ తమ్ముడూ..." గర్వంగా నవ్వింది.

బుర్ర గోక్కున్నాం.

మేం ఏదో మాట్లాడబోతే, "ముందు వీళ్ళకో ముద్ద పెట్టనీండ్రా" అంది.

మా నోళ్ళకి తాళం పడింది.

గబగబా వాళ్ళకి స్నానాలు చేయించింది. ఎక్కడ్నుంచో పెద్దోడూ చిన్నోడూ తొడిగిన చిన్నప్పటి దుస్తులు తెచ్చి వాళ్ళకి తొడిగింది. అన్నం తినిపించి నిద్రపుచ్చింది.

అప్పుడు మా దగ్గరి కొచ్చి "ఏమాలోచించారూ" అనడిగింది పెద్దమ్మ.

"వీళ్ళెవరు?"

"మనలా పుట్టిన వాళ్ళే. వాళ్ళమ్మ వీళ్ళని పోషించలేక అమ్మేస్తోంటే పోలీసులు స్టేషన్‌కి లాక్కుపోయార్ట. ఆమె పరిస్థితికి జాలిపడి ఎవరైనా పెంచుకునే వాళ్ళుంటే ఇచ్చేస్తే మంచిదనుకుని అనాథాశ్రమానికి ఫోన్ చేశార్ట. వాళ్ళేమో నేను ఒకరిద్దర్ని పెంచుకోవాలని వచ్చినట్టు చెప్పగా నాకు ఫోన్ చేశారు..." అదేదో సింపుల్ సంగతన్నట్టు చెప్పింది.

"అయితే వీళ్ళ బరువు మీదేసుకుంటున్నావన్న మాట"

"కాలూ చెయ్యీ బాగానే ఉన్నాయిగా. ఏదో నాకు తోచింది నాకు చేతనైంది చేద్దామని..."

పెద్దమ్మకేసి విస్మితులమై చూశాం.

"ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొన్నావు...నీ భవిష్యత్తే అగమ్యగోచరంగా ఉన్నప్పుడు నువ్వు వీళ్ళకి భవిష్యత్తు ఇవ్వాలనుకోవటం... చాలా చిత్రంగా ఉంది"

నా మాటల్లో కించిత్తు వ్యంగ్యం ధ్వనించిందేమో చివ్వున తలెత్తి నా మొఖంలోకి చూసింది. తలదించుకున్నాను.

"బతుకంటేనే ఆరాటం. సమస్యలు. ఘర్షణలు. పోరాటం. వాటిని ఎదుర్కొంటూనే ఒకరిద్దరికైనా చేయి అందిస్తే చేయూతనిస్తే కొండంత ఆత్మతృప్తిగా వుంటుందిరా గోపీ. మనకోసం మనం బతికేది బతుకు అవుతుందేంట్రా పిచ్చి నాన్నా"

మొహం ఎర్రగా చేసుకునన్నాను "పెదనాన్న లేరన్న సంగతి గుర్తుందనుకుంటాను"

నిలువుగా తలాడించింది.

"ఈ ఇంటిని కట్టినప్పుడే నా పేరున పెట్టారు. పదిమందికి సరిపోయే ఇల్లు. ఈ ప్రక్కకి సూర్యోదయం కన్పిస్తుంది. ఆ ప్రక్కకి సూర్యాస్తమయం కన్పిస్తుంది. చిన్నదే అయినా

నీళ్ళకీ పాలకీ లోటులేని ఇల్లు. ఇంటి చుట్టూ కాయగూరలు పండే తోట కూడా ఉంది. చూసే ఉంటావు. ఇంకేం కావాలి చెప్పు? అన్నట్టు – మీ పెదనాన్న ఫ్యామిలీ పెన్షన్ నాకే వస్తుందిరా. నెలకి ఏడెనిమిది వేల దాకా వస్తుందిట. ఆఫీసు వాళ్ళు చెప్పేరు. దానితో ఈ పిల్లలకో దారి చూపించలేనా చెప్పు?"

మాకు నోట మాటరాలేదు.

అతికష్టం మీద నోరు పెగల్చుకునన్నాను "ఈ వయస్సులో కృష్ణా రామా అనుకుంటూ ఓ మూలన కూర్చోక ఈ బరువు బాధ్యతలు అవసరమా పెద్దమ్మా?"

"ఓ ప్రక్కన పెద్దమ్మా అంటూనే అలా మాట్లాడతావేంట్రా గోపీ! నేను మనిషిగా బ్రతకాలనుకుంటున్నాను గాని ఏదో నామకా బతికి విగ్రహపుష్టిలా ఉన్నాననిపించుకోదల్చుకో లేదురా"

రెండు ముక్కల్లో తేల్చేసింది. కానీ మాకెవరికీ రుచించలేదు.

"సవతి పిల్లల్ని నీ పిల్లలనుకున్నావ్. కానీ వాళ్ళేం చేశారు? ఇంత దుమ్ము నీకంట్లో పోసి ఎగిర చక్కా పోయారు" విశ్వం అన్నాడు అక్కసుగా.

చిన్న పిల్లాడి మాటలకు నవ్వినట్లు నవ్వింది.

"వాళ్ళకి రెక్కలు రావడానికి కించిత్తు తోడ్పడ్డానన్న తృప్తి చాలు. వాళ్ళు తిరిగి నాకేదో చేయాలని నేనెన్నడూ ఆశించలేదు. ఎంచేతంటే కర్మ చెయ్యడమే నాకు తెలుసు. ఫలం గురించి ఆలోచించను"

"పెద్దమ్మ గీతా బోధ చేస్తోందిరా!" నవ్వుతా మిగతా వాళ్ళతో అన్నాను. పెద్దమ్మ పెద్ద పెద్ద మాటలకు నా ఒళ్ళు కొత్త బ్లేడుతో చీరి కారం అద్దినట్టు మండిపోతోంది.

"అవన్నీ పెద్ద పెద్ద చదువులు చదివిన మీకు తెలుస్తాయి గాని నాకేం తెలుస్తాయిరా నా మొఖం. నాదంతా వానాకాలం చదువు. మంగళ హారతులు పాడటం, చాకలి పద్దులు రాయడం తప్ప నాకేమీ రాదు..." మరో మాటకు అవకాశం ఇవ్వకుండా లేచింది.

సరిగ్గా అప్పుడే ముగ్గురు పిల్లల్లో చిన్నది నిద్రలేచి 'పెద్దమ్మా' అంటూ ఏడుస్తూ పిలిచింది.

తల్లి ఆవులా "వస్తున్నానే బుజ్జికొండా" అంటూ ఆత్రంగా వెళ్ళింది.

సందేహం లేదు. పెద్దమ్మ పిచ్చిదో వెర్రిదో అయి వుంటుంది. లేకపోతే అయిన వాళ్ళని కూరలోని కరివేపాకులా తీసి పారేస్తుందా!

మీరు చెప్పండి. మీరేమనుకుంటున్నారు?

మీరేంటి ఎవరైనా నాలాగే ఆలోచిస్తారు. నాలాగే మాట్లాడతారు. మన బతుకే మన బాగే మనకి ముఖ్యం!

"ఇంకెందుకీ కంచి గరుడ సేవ, లేవండి..." కోపంగా అంటూ విసురుగా

లేచాను.

గుమ్మం దాటుతూ వెనుదిరిగి చూశాను.

కులం మతం వర్ణం రక్తం ఎవరివో ఏమిటో ఏమీ తెలియకపోయినా ఆ ముగ్గురు పిల్లల్నీ ఆప్యాయంగా సందిట్లోకి తీసుకుని అపురూపంగా నవ్వుతూ నూరేళ్ళు చల్లగా బతకాలని కళ్ళతో ఆశీర్వదిస్తూ ఏదో ఆత్మీయంగా చెబుతోంది పెద్దమ్మ.

"అమ్మలగన్న అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ కడుపారగ పుచ్చినాయమ్మ..." అప్రయత్నంగా చిన్నప్పుడెప్పుడో చదివిన పద్యం నా మెదడు పొరల్లో కదిలింది.

విస్మితుడనై చూశాను. పెద్దమ్మ నవ్వు కనకదుర్గమ్మ చిరునవ్వులా కనిపించింది.

చటుక్కున గుర్తొచ్చింది. పెద్దమ్మ పేరు కనకదుర్గ!

చేతులు జోడించాలనిపించింది – ఒక్క క్షణం!

*     *     *

**(నవ్య వారపత్రిక–26–8–2015)**